అక్క

చిరుమామిళ్ల శివరామకృష్ణప్రసాదుగారు

౧

ఒక్కొక్కనిర్భాగ్యురాలపాలబడే క్రూరుడగు భర్తయొక్క దుశ్చేష్టితాలను వర్ణించివర్ణించి 'అలాంటి భర్తనోట నిప్పుపడ' అని తనకోపాన్ని వెల్లడించింది తార.

ఇందుకు జయగోపాలబాబు భార్య చాలా నొచ్చుకున్నది; ఎట్టిపరిస్థితులలోనైనా సిగిరెట్టుకుచెందిన నిప్పుతప్ప వేరేవిధమైనటునిప్పు భర్తనోటవుండాలని అనుకోవడము స్త్రీజాతికితగదు అని తనమాట కడ్డుచెప్పి నందుకు తార మండిపోయి 'అల్లాంటిభర్తకు భార్యగావున్నదానికంటె, ఏడుజన్మాలవరకు వెధవగాఉండటం మంచిది'అని కసరుకుంటూ వెళ్లిపోయింది.

శశి తనలో "భార్యకంత హృదయకాఠిన్యమును ప్రబలజేయు భర్తనేరమేమో ఊహించుట కష్ట"మని అనుకున్నది. ఇంతలోనే దూరదేశమునందున్న భర్తమీదిప్రేమ ఆమె హృదయమునుండి పొంగిపొరలింది. పాన్పుపై భర్తపరుండుభాగమున చేతులుచాచి ఆమె వాలిపోయింది; తలగడ ముద్దెట్టుకున్నది. గదితలుపులు మూసి ఒక కొయ్యపెట్టెనుండి రంగుపోయిన ఒకపాతఫొటోను తనభర్తవ్రాసిన జాబులనుతీసి వాటివైపు రెప్పవాల్చకచూస్తూకూచున్నది. అలాగా ప్రశాంతమధ్యాహ్నకాలమును ఒంటరిగాగడిపింది; పూర్వపుసంగతులను తలుచుకుంటూ; దుఃఖాశ్రుకణములురాలుస్తూ.

శశికళాజయగోపాలుల కిదియొక నూతనబంధముకాదు. వారికి చిన్నతనమందే వివాహమయింది; పిల్లలుకూడాకలిగారు. వారొకచోటనేయుండుటచే రోజులు చులకనగా గడచిపోయినవి. వారిలో ఎవరియందును ప్రేమోద్రేకచిహ్నములు కనబడలేదు. పదహారేండ్లవరకు ఎప్పుడూ విడిపోకుండా వారొకచోటనే కలసిమెలసియున్నారు. తుదకు కొంతపనిమీద భర్త ఇల్లువదలి వెళ్లవలసివచ్చినది; శశిహృదయంలో ప్రేమోన్మాదము ప్రారంభించింది. ఈవియోగము క్రమముగూర్చినకొలది ప్రణయబంధము మిగుల బిగించుకొనిపోయి గట్టిపడినది. శశి ఎన్నడెరుగనిప్రేమోద్రేక మామెకు బాధగల్గించింది.

అన్నాళ్లకు ఆయీడులో పిల్లలతల్లియగు శశి, ఆమధుమాసమధ్యాహ్నమునందు ఒంటరిగా గదిలో వియోగశయ్యపైపరుండి, యౌవనారంభములోనున్న వధువువలె తీయనికలలుకంటూన్నది. ఆమెకిదివర కెరుకలేనిప్రేమ తన మధురసంగీతముతో ఆమెను మేలుకొలిపింది... ఆమె పెలయేటిఒడ్డున చాలాదూరము నడచింది. ఇలుదరులయందు బంగారుమేడలు, తోటలు కనుపించినవి. కాని విస్మృతివడ్డనుఖాపేక్షలలో అడుగిడటానికామెకు తావుకన్పడలేదు. ఈసారి భర్తనుకలసికొన్నప్పుడు మధుమాసవాసరములను వృథాపుచ్చక జీవితమాధుర్యము ననుభవింపదలచింది. ఇదివరకెన్నిసార్లామె వృథాజగడములవలన భర్తను విసిగించింది!... పశ్చాత్తాపహృదయముతో ఆమె ప్రతినపట్టినది: 'ఇకనెన్నడు భర్తయెడ చిరాకుపడను, అతనియాజ్ఞలను శిరసావహించి మంచికాని, చెడ్డకాని అతడుకోరినప్రకారము చేయుచుండెదను-నాభర్తయే నాసర్వస్వము-నాప్రేమనిధానము-నాదైవము."

శశికళ తనతల్లిదండ్రుల కొక్కతేకూతురు. అందుచేతనే జయగోపాలుడు కొద్దిపాటి ఆస్తిపరుడైనా ఎట్టిచింత పెట్టుకొనలేదు. మామగారలనిని దొరకలెకూర్చుండబెట్టి పోషించగలడు.

ఇట్లుండ ముసలితనములో శశికళ తల్లిదండ్రులకొక కుమారుడుపుట్టెను. ఎన్నడూఅనుకోని ఈసంఘటనమునకు శశికళ మనస్సులో దుఃఖించింది. జయగోపాలుడూ సంతోషించలేదు. లేకలేకకలిగిన పిల్లవాడి

1044

మీద తల్లిదండ్రుల ప్రేమంతా ఒరిగింది. ఈక్రొత్తగావచ్చిన చిన్నబావమరది, ఉయ్యాలలోనిద్రపోతూ తన చిన్నగుప్పిళ్లలో జయగోపాలుని ఆశలు, ఆశయములు నొక్కిపట్టుకున్నాడు —జయగోపాలుడు అస్సాములో ఒకటీతోటలో పనిసంపాదించేడు.

అతనిస్నేహితులంతా దగ్గరలో ఎక్కడైనా ఉద్యోగముసంపాదించమన్నారుకాని, త్వరలో అభివృద్ధికి రావచ్చుననో లేక మరేమైనా కోపమువలననో వారిమాట లాతడు లక్ష్యపెట్టలేదు. భార్యను పిల్లలను పుట్టింటికి పంపి, అస్సాము వెళ్లిపోయినాడు. వివాహమైనతరువాత భార్యాభర్తల కిదియే మొదటియెడబాటు.

ఇల్లాజరిగినందుకు శశికళకు తనచిన్నతమ్మునిమీద కోపమువచ్చింది. మాటలవలన బయటకురాక పోయినా అది హృదయంలో తీవ్రంగా నేయున్నది. పిల్లవాడు పాలుతాగి తనదారితాను నిద్రపోతున్నా అక్కమాత్రము అన్నముచల్లారిపోయిందని, వేళైనా పిల్లలు బడికివెళ్లలేదని ఏవేవో సాకుకల్పించుకొని ధుమ ధుమలాడుతుండేది. కొద్దికాలములోనే పాప మాపిల్లవాడు తల్లిలేనివాడైనాడు. తల్లి చనిపోయేముందు తన పసికూనను కూతురు కొప్పగించిపోయింది.

ఆతల్లిలేనిపసికూన అతిసులభంగా అక్కహృదయాన్ని వశపరచుకున్నాడు. జిలిబిలికేకలతో ఒక్క సారి ఆమె మెడ కౌగలించుకొని ఆమెనోరు, ముక్కు, కండ్లను తనబోసినోటిలో ఇముడ్చుకోబోతాడు. ఆమెవెంట్రుకలు తనచిన్ని చేతులతో పట్టుకుని విడువడు. తెల్లవారకపూర్వమే లేచి అక్కవైపునకుదొల్లి, సెల యేరులాగు అవ్యక్తంగాధ్వనిచేస్తూ ఆమెను మెల్లగాముట్టుకొని చక్కలిగింతపుట్టిస్తాడు. ఒక్కొక్కప్పుడు 'జిజి' 'జిజిమ'అంటాడు. ఆమెపనిలోవున్నప్పుడు లేక విశ్రాంతిలోవున్నప్పుడుకూడా వద్దన్నపనిచేస్తూ, తినవద్దన్నవి తింటూ, పోవద్దన్నస్థలములకుపోతూ, నిరాఘాటంగా తనప్రభుత్వ మామెమీద చలాయిస్తున్నాడు. ఈచిన్న పరిపాలకునకామె పూర్తిగాలొంగిపోయింది. తల్లిలేనిపిల్లవాడవటంవలన అతఁడామె నెక్కువగాఆకర్షించేడు.

౨

కుఱ్ఱవాడికి నీలమణియని పేరుపెట్టేరు. అతనిరెండవయేట తండ్రికి చాలాజబ్బుచేసింది. జయగోపాలుని త్వరగారమ్మని జాబువ్రాశారు. శెలవుదీసుకొని కాశీప్రసన్నుని అంత్యదశలోవచ్చి చేరుకున్నాడు జయగోపాలుడు. కాశీప్రసన్నుడు తనకుమారుని జయగోపాలునిపోషణకప్పగించి, తనఆస్తిలో నాల్గవభాగము కూతురగు శశికళ పేరవ్రాసి చనిపోయినాడు.

జయగోపాలుడుద్యోగముమాని స్వంతవ్యవహారాలు చూసుకుంటూ ఇంటివద్దనేయున్నాడు.

చాలాకాలానికి మళ్ళీ భార్యాభర్తలు కలుసుకున్నారు. ఒకవస్తువు పగిలిపోతే మళ్ళీ దానిని అతుకు పెట్టవచ్చుకాని మానవవ్యక్తులిద్దరు విడిపోతే, చిరవియోగానంతరము తిరిగీ ఒకేస్థలములో ఒకేవిధంగా కలియరు—చిత్తమొక చైతన్యపదార్థము; నిముసనిముసమునకది అభివృద్ధిచెందుతూ మారిపోతూవుంటుంది.

శశిహృదయంలో పునస్సమావేశము రసతరంగాలనులేపింది. పూర్వమున్న అచైతన్యస్వభావం మారి పోయింది; ఆమెభర్తను గాఢంగాప్రేమించి వశపరచుకొనయత్నించింది. ఇదివరకామె ప్రతినపట్టినదిగదా!— ఎట్టిదినములు తారసిల్లినను, అవి యెంతదీర్ఘములైనను, భర్తయెడగల తనప్రేమకు వన్నెతరగనీవని.

జయగోపాలున కీపునస్సమావేశము వేఱొకవిధముగా పరిణమించినది. పూర్వమిద్దరూ కలసియున్నదిన ములలో అతనెప్పుడూ భార్యపైనే బద్ధుడైయుండువాడు—ఆమె తనతోలేకపోతే సహించేవాడుకాదు. కను కనే దూరదేశంలో రోజులు చాలకష్టంగాగడిపేడు. అది అలవాటైపోయి ఒకనూత్న[illegible]ము అతని హృదయంలో బయలుదేరింది.

1045

అంతేకాదు: ఇదివరలో అతడు నిర్లక్ష్యంగా రోజులుగడిపేవాడు కాని రెండుసంవత్సరాలనుండి తన స్థితిగతులను అభివృద్ధిలోనికితీసుకొనిరావలెననెడికోర్కె అతనిహృదయంలో చెలరేగింది. అతడెప్పుడూ ఈవిషయమే ఆలోచిస్తూవుండేవాడు. ఈనూత్న భావోద్రేకముతో పోల్చిచూస్తే గడచినజీవితమొక నిస్సారపు నీడవలె అతనికి కనుపించింది.—స్త్రీప్రకృతిలో కలిగే గొప్పమార్పు ప్రేమవలన; పురుషప్రకృతిలో ఆశవలన.

రెండుసంవత్సరాలకుతిరిగివచ్చిన జయగోపాలునకు భార్యలో మార్పు కన్పించింది. ఆపసిపిల్లవాడామె జీవితానికి కొంతవిశాలత్వం సమకూర్చేడు. పసిపిల్లవానికిచెందిన ఆమెజీవితభాగముతో జయగోపాలునకు పరిచయములేదు. భార్యతో ఈవిషయంలో సాంగత్యమూలేదు. కుఱ్ఱవానిమీద తనకున్న ప్రేమ భర్తతో పంచుకో దలచిందామెకాని కృతార్థురాలైందని చెప్పలేము. నవ్వుతూ పిల్లవానిని తీసుకొనివచ్చి భర్తముందు నిలువబెట్టుంది—నీలమణి శశికంఠము కౌగలించుకొని బాంధవ్యబంధ మొప్పుకోడు. మానవహృదయాన్ని వశపరచుకొనుటకు పిల్లవాడుచూపే కళాకౌశలము తనభర్త ఒక్కసారిచూస్తే బాగుండుననుకున్నది శశి. కాని జయగోపాలున కీవిషయమై కుతూహలములేనేలేదు. అట్టియెడ ఆకుఱ్ఱవానికిమాత్ర ముత్సాహముండునా? ఆవికృతాకారముగల పిల్లవాడిపై ఇంతప్రేమ వృథాపరచట మెందుకో జయగోపాలునకు తెలియలేదు.

స్త్రీలు ప్రేమతత్వమును త్వరగా గ్రహించుటలో నిపుణులు. నీలమణియెడ జయగోపాలుడు నిర్లక్ష్యభావమును కలిగియున్నాడని శశి అప్పుడే గ్రహించింది. అప్పటినుండి జాగ్రత్తపరచినదితమ్ముని—ప్రేమరహితమగు తనభర్తయొక్క కరకుచూపులనుండి. ఆవిధంగా ఆపసికూన రహస్యంగాకాపాడవలసిన ఒక పెన్నిధియైనాడు—ఏకాంతప్రేమనిధానమైనాడు.

నీలమణి ఏడ్చినప్పుడల్లా జయగోపాలుడు విసుగుకుంటాడు. అందువల్ల శశి పిల్లవానినిబుజ్జగించి ఓదార్చేది. రాత్రులందు నీలమణిఏడ్పువల్ల నిద్రకు భంగముకలిగితే జయగోపాలుడు కసరుకుంటూ పిల్లవానినిజూచి గర్జించేవాడు. శశి అణగిపోయి పెద్ద తప్పుచేసినదానివలె గడగడవణుకుతూ పిల్లవానిని దూరముగాతీసుకొనిపోయి 'నాబంగారుకొండ' అని ప్రేమవెల్లివిరియ బుజ్జగించి నిద్రబుచ్చేది.

పిల్లలు తెలియక ఎన్నెన్నోపనులుచేస్తారు. అట్టిసమయములం దిదివరలో శశి తనపిల్లలనుదండించి, తల్లిలేనివాడని నీలమణిపక్షంపలికేది. ఇప్పుడు న్యాయాధికారితోపాటు న్యాయముకూడామారింది. తప్పులేకుండా, విచారణలేకుండా నీలమణి మిగుల దండింపబడుచుండెను. ఈవిషయము శశిహృదయమునకొక బాకుపోటయ్యెను. దెబ్బలుతిన్నతమ్ముని తనగదిలోనికి తీసుకొనిపోయి బొమ్మలు, మిఠాయిపెట్టి చేతనైనంతవరకు ఓదార్చ ప్రయత్నించేది.

భర్త తన్నెప్పుడైనదూషించునప్పుడు శశి ప్రేమచిప్పిలువాక్యములతో శాంతపరచేది; కాని నీలమణి విషయములో వారొకరినొకరు నిముసమునకొకసారి ద్వేషించుకొంటూనేయున్నారు.

బహిర్గతముగానుండు కలహముకన్న అంతరంగికముగానుండు ద్వేషమును సహించుటకష్టము.

3

నీలమణియొక్క అవయవములన్నిటిలో తలపెద్దది. సృష్టికర్త ఒకసన్ననిపుల్ల పైభాగమున పెద్దబుడగను నిలిపియుంచినట్లాతనిఆకారముండును. బుడగవలెనే అతనిజీవితము క్షణభంగురమగునేమోయని వైద్యులు భయపడిరి. చాలారోజులవరకాతడు నడచుటగాని, మాట్లాడుటగాని యెరుగడు. అతనిముఖమును చూచినయెడల, తల్లిదండ్రులు వారివృద్ధాప్యముయొక్క దుఃఖభారమును అచ్చట దిగవిడిచిపోయినట్లు స్ఫురించును.

అక్కయొక్క అదుపాజ్ఞలలో ఎట్లో నీలమణికి ఐదేండ్లుగడచి ఆరవయేడు ప్రవేశించి

కార్తికమాసములో *భాయిఫోటో పండుగరోజు శశి నీలమణిని అలంకరించినది; ఒక కోటు, పట్టంచు ధోవతికట్టి బొట్టుపెట్టుచుండగా, ఇంటిప్రక్కనున్న తారవచ్చి లేనిపోనికారణములతో పోట్లాట మొదలు పెట్టింది. "రహస్యంగా తమ్ముడికొంపగూలుస్తూ, పైకెంత ఆడంబరంగాపండగచేయుట మెందు"కని తార ప్రేలటం మొదలుపెట్టింది.

ఈమాటవిని శశి నిర్ఘాంతపోయింది. ఆమెకు కోపముకూడావచ్చింది. శశి తనభర్తతో కలసి, మైనరైన నీలమణియొక్క ఆస్తి ఋణాలుతీర్చటానికనిఅమ్మి, లోపాయికారీగాతిరిగి పినతండ్రికొడుకుపేర కొంటున్నదని తార అందరితో చెప్పటం మొదలుపెట్టింది. ఈమాట శశివిని 'అట్లా అన్నవాండ్లనోట్లో కుష్ఠురోగం పుట్టా' అనితిట్టింది. తరువాత భర్తవద్ద ఏడుస్తూపోయి ఈవిషయమంతా చెప్పింది. జయగోపాలుడు అంతావిని "ఈరోజుల్లో ఎవరినీనమ్మడానికి వీలులేదు; నాపినతండ్రికొడుకగు ఉపేంద్రునిజవాబుదారిలో ఈయాస్తి వుంచటంమంచిదని నేననుకున్నాను. కాని అతడు నాకుతెలియకుండా హసిల్‌పూర్ తాలూకాను ఋణాలకనిఅమ్మి తిరిగి రహస్యంగానే తాకొన్నాడట." అనిచెప్పేడు.

"వీరందులకై వ్యాజ్యము వేయరా?" అని ఆశ్చర్యంతో అన్నది శశి.

"పినతండ్రికొడుకుపై వ్యాజ్యమా! డబ్బువ్యయం-ఎందుకు?" అన్నాడు జయగోపాలుడు.

భర్తమాటయందు నమ్మకముంచటము శశికి విధ్యుక్తధర్మము; కాని ఆమె నమ్మలేదు. ప్రేమకాస్పదమగు గృహజీవితముపై ఆమెకసహ్యముపుట్టెను. ఒకప్పుడు సుఖముగ తలదాచుకొనుటకు ఆలవాలముగానున్న గృహము నేడు స్వలాభాపేక్షచే సమకూర్పబడిన పన్నాగముల వలవలె తోచెను. ఆమె అబల; ఒంటరికత్తె; నిస్సహాయుడగు నీలమణిని రక్షించుట కామెకేమియు తోచలేదు. ఆమె యాలోచించినకొలది హృదయమున భయమధికమగుచుండెను. రాజప్రతినిధికడ కేగవలయుననియు, లేదా మహారాణిపేర తమ్ముని ఆస్తిని రక్షింపుమని వినతిపత్రము పంపవలెననియు తలచెను. సంవత్సరమున కేడువందల ఏబదియెనిమిదిరూపాయల రాబడిగల హసిల్‌పూర్ తాలుకాను మహారాణీకి తెలిసినచో అమ్మనిచ్చునా?

మహారాణీతో విన్నవించి తనభర్తయొక్క పినతండ్రికొడుకుపై దావావేయవలెనని శశి ఆలోచిస్తూవున్నరోజుల్లో ఆకస్మికముగా నీలమణికి జ్వరము, వాంతులు ప్రారంభించినవి.

జయగోపాలు డొక పల్లెటూరివైద్యుని పిలచెను. మంచివైద్యునకు కబురంపమని శశి కోరగా "ఎందుకు? మతీలాలు సాధారకమువైద్యుడనుకున్నావా?"అని భర్త జవాబుచెప్పెను.

శశి భర్తకాళ్ళపై బడెను. మిగుల ప్రార్థించెను. "సరే డాక్టరుకొరకై పట్నానికి మనిషినిపంపుతా"నన్నాడు భర్త. నీలమణిని తొడపై పరుండబెట్టుకొన్నది శశి. ఒక్కనిమిషమైనా ఆబాలుడు అక్కను విడిచిపెట్టలేదు. ఆమె తన్ను విడచిపోవునేమోయని బాలుడామెను కౌగలించుకొనెను. నిద్రపోవునపుడు కూడ ఆపసికూన అక్క చీరచెరగును పట్టుకొనియేయుండెను.

ఆదినముగడచెను. ప్రొద్దుగ్రుంకువేళ జయగోపాలుడు వచ్చి డాక్టరు ఇంటివద్దలేడని వేరొకరోగిని చూచుటకువెళ్ళెనని చెప్పెను. కొంతతడవునకు తాను పనిమీద ఇల్లువదలి వెళ్ళుచున్నాననియు, మతీలాలు పిల్లవానిని సరిగా చూచునట్లు చెప్పెదననియు తెల్పెను.

---

*ఈపండుగరోజు అక్క తమ్మునకు కొత్తబట్టలుపెట్టి, గంధపుబొట్టుపెట్టి దీవించును. ఉత్తరహిందూదేశములో నేటికిని ఈపండుగ ఆచరణలో కలదు.

ఆరాత్రి నీలమణి నిద్రలో కలవరించెను. తెల్లవారగనే శశి నిర్భయముగ పడవపైబయలుదేరి తమ్ముని డాక్టరుకడకు తీసుకొనిపోయెను. డాక్టరు ఇంటివద్ద నేయుండెను; అతడెచ్చటికిని వెళ్ళలేదు. శశికి బస వది రిచి ఆమెకడ నొకముసలివితంతువును తోడుగానుంచి డాక్టరు పిల్లవానికి మందుప్రారంభించెను.

మరుసటిదినము జయగోపాలు దచ్చటకువచ్చెను. భార్యను తక్షణమింటికిరావలసినదని ఆజ్ఞాపించెను.

"నన్ను ముక్కలుముక్కలుగా నరికివైచినను నేనురాను. తల్లిదండ్రులులేని నీలమణిని మీరు చంప దలచినారు; నేనాతనిని రక్షింపకతప్పదు" అని శశి పలెక్కెను.

"ఇచ్చటనేయుండుము. నాయింటికి రావల"దని జయగోపాలుడు గర్జించెను.

శశి మిగుల రోషముతో "మీయిల్లు నాతమ్మునిది కాదా?" యనెను.

'సరే' అన్నాడు జయగోపాలుడు. చుట్టుప్రక్కలవారంతా ఈవిషయాన్ని గల్లంతుచేశారు.

"నీభర్తతో ఇంటివద్ద తగవులాడుము; నీవు ఇల్లువదలిపెట్టుటేమి మంచిది? జయగోపాలు డెట్లయినా నీభర్తగదా" అన్నది తార.

తనవెంటతెచ్చిన ధనమంతా ఖర్చయిపోగా శశి తననగలమ్మి ఎట్లాగో తమ్ముని బ్రతికించుకొన్నది. ద్వారీగ్రామంలో నీలమణికి గల పదిహేనువందలరాబడిగల పొలము, ఇల్లు జయగోపాలుడచ్చటియున్న జమీం దారు సహాయంతో తనపేర పెట్టించుకున్నాడని శశి విన్నది. ఇప్పుడు ఆస్తిసర్వము జయగోపాలునిదే; తన సోదరునకు సున్న.

జబ్బు నివృత్తించినతరువాత నీలమణి తన స్నేహితులను శశి బిడ్డలతో ఆడుకొనవలెనని "అక్కా! ఇంటికిపోదము; మన పాతఇంటికి పోదా"మని పోరుపెట్టేవాడు. ఈమాటలకు శశి ఘోరున ఏడ్చేది. వారికి గృహ మెచ్చటనున్నది?

ఏడ్చి లాభములేదనుకొని కన్నులుతుడుచుకొని మేజస్ట్రీటగు తరణీబాబుజనానాలోనికి వెళ్ళి ఆయన భార్యతో సంగతంతా చెప్పింది శశి. మేజస్ట్రీటు జయగోపాలుని బాగుగానెరుగును. ఆస్తికిచెందిన తగాదా వలన ఇల్లువదలి ఇట్లా ఆడమనిషి రావటము మేజస్ట్రీటుకు నచ్చలేదు. వెంటనే జయగోపాలునిపేర జాబు వ్రాశాడు. జయగోపాలుడువచ్చి భార్యను, నీలమణిని బలవంతముగా పడవలో ఎక్కించుకొని ఇంటికి తీసు కొని వచ్చేడు.

రెండవ యెడబాటైనతరువాత భార్యాభర్తలు కలుసుకున్నారు. ప్రజాపతిఆజ్ఞ!

చాలారోజులకు స్నేహితులను కలుసుకొన్నందుకు నీలమణి చాలా సంతోషించేడు. ఆపిచ్చిసంతోషం చూచి శశి హృదయం బ్రద్దలయ్యేటట్టు విలపించింది.

౪

రాష్ట్రాధికారి వేటకోస మాయూరిలో డేరావేసుకొని మకాముగా వున్నాడు. మైదానంలో ఆడు కుంటున్న నీలమణిని అధికారి చూచేడు. తక్కినపిల్లవాళ్ళంతా ఏదో పదాలు పాడుతున్నారు. కాని నీల మణి అధికారివేపే ఒకటే చూడటం మొదలుపెట్టేడు.

అధికారి చాలా ముచ్చటపడి 'నీవు పాఠశాలలో చదువుతున్నావా?' అని బెంగాలీభాషలో నీలమణిని ప్రశ్నించేడు. నీలమణి తలఊపేడు. 'ఏమి పుస్తకాలు చదువుతున్నా'వన్నాడు మళ్ళీ అధికారి. 'పుస్తక' మన్నమాట నీలమణి కర్థంగాలేదు మెదలకుండా నుంచున్నాడు.

1050

ఇంటికివెళ్ళి తాను రాష్ట్రాధికారితో మాట్లాడినట్లు మిక్కిలి సంతోషముతో నీలమణి అక్కతో చెప్పేడు.

మధ్యాహ్నమువేళ జయగోపాలుడు కోటువేసుకొని, తలపాగాచుట్టి అధికారిదర్శనానికి వెళ్లేడు. అక్కడ చాలామంది నౌకర్లు గుంపులుకూడిఉన్నారు. అధికారి ఒకచెట్టునీడన బల్లపైకూర్చున్నాడు. జయగోపాలుడు వెళ్లగానే కుర్చీవేయించి అతడు కూర్చున్నతరువాత, గ్రామపరిస్థితులనుగురించి అధికారి ప్రశ్నించేడు. తనకుజరిగినగౌరవానికి పొంగిపోతూ ఎవరైనాతోటివాండ్లు వచ్చిచూస్తే బాగుండునని మనస్సులో అనుకున్నాడు జయగోపాలుడు.

ఇంతలో, ముసుగువేసుకొని ఒకస్త్రీ నీలమణిని వెంటబెట్టుకొని అధికారివద్దకు సరాసరివచ్చినిలచింది.

"అయ్యా! నిస్సహాయుడగు ఈపిల్లవానిని మీచేతుల్లోపెట్టుతున్నాను; రక్షించండి" అన్నది.

ఆపిల్లవానిని ఇదివరకే అధికారి చూచియున్నందున, ఆమె యొకగొప్పకుటుంబమునకు చెందినదని గ్రహించి, వెంటనే లేచినిలచి "డేరాలోనికి దయచేయండ"ని అధికారిపల్కెను.

"నేను చెప్పదలచుకున్న దిచ్చటేచెపుతా"నని ఆమె జవాబుచెప్పెను.

జయగోపాలుడు తెల్లబోయినాడు. గ్రామస్థులంతా వింతచూడాలని చుట్టూమూగేరు; కాని అధికారి బెత్తముపైచేయివేయగానే అందరూ పారిపోయినారు.

శశి అధికారికి సంగతంతా విన్నవించింది. అప్పుడప్పుడు జయగోపాలుడు మాటకడ్డువచ్చేడు కాని, అధికారి 'నోరుమూయ'మని గర్జించి అతనిని కుర్చీమీదనుండిలేవమని బెత్తంతో సైగచేశాడు.

శశిమీద మండిపోతున్నాడు జయగోపాలుడు. కాని మాట్లాడకుండా నిలుచున్నాడు. అక్కచెప్పుతున్నదంతా పసివాడు నోరుతెరచుకొని వింటున్నాడు.

శశిచెప్పిన కథంతావిని అధికారి జయగోపాలుని కొన్నిప్రశ్నలడిగి, తగుజవాబులుపొంది కొంతసేపూరకుండి, మళ్లీ ఆమెనుజూచి "ఈవిషయము నావద్దకు విచారణకురాదు; ఐనప్పటికి నాచేతనైనంతసహాయం చేస్తాను. మీరు భయపడకుండా తమ్మునితో ఇంటికివెళ్లండి" అన్నాడు.

అంతట శశి "అయ్యా! ఈపిల్లవానిఇల్లు తిరిగి వానికివచ్చేవరకు నేనాయింటికి వానిని తీసుకొనివెళ్లటానికి భయపడుతున్నాను. వీనిని మీవద్ద నేయుంచుడు; వేరేవిధంగా రక్షించేవీలులేదు" అన్నది.

అధికారి చిరునవ్వునవ్వేడు. తాయెత్తులు మెడనిండాకలిగియున్న ఆసన్నని వింతముఖముగల బెంగాలీ పిల్లవానిని రక్షణలోనికి తీసుకొనటానికి ఒప్పుకున్నాడు.

శశి శలవుతీసుకొని వెళ్లిపోతుండగా పిల్లవాడు ఆమెచీరెపట్టుకున్నాడు. 'భయపడకు నాయనా!' అని అధికారి హెచ్చరించేడు.

అమితంగాఏడుస్తూ, దీనవదనముతో 'నన్నుపోనియ్యి నాయనా! మళ్లీనిన్ను కలుసుకుంటానులే'అన్నది శశి. పిల్లవానిని కౌగలించుకొని బుజ్జగించి, చీరెవదలించుకొని శశి వెళ్లిపోయింది. అధికారి పిల్లవాడిని పట్టుకున్నాడు. 'అక్కా! అక్కా!' అని పిల్లవాడు ఏడవటంమొదలుపెట్టేడు. శశి వెనక్కుతిరిగి, చేతులుచాచి అవ్యక్తంగా ఏమేమోఅంటూ గుండెపగిలిపోయేటట్లు దుఃఖిస్తూ వెళ్లలేకవెళ్లిపోయింది.

మళ్లీ ఆయింట్లో భార్యాభర్తలుకలిశారు. ప్రజాపతిఆజ్ఞ!

ఈకలయిక ఎక్కువదినములు నిలిచియుండలేదు. శశి కలరావల్ల చనిపోయినదని, ఆరాత్రే శవాన్ని దహనంచేశారని ఒకరోజు ఊళ్లో వదంతిబయలుదేరింది. ఒక్కరూ మాట్లాడలేదీవిషయాన్నిగురించి. అప్పుడప్పుడు తార ఏదోచెప్పవచ్చేదికాని, అందరూ నోరుమూయించేవారడ్డు 'ఇశ్శో' అంటు.

విడిపోయేరోజు శశి 'నేను నిన్నెప్పటికైనా కలుసుకుంటానని' తమ్మునితోచెప్పింది. ఆమాటఎట్లు నిర్వహింపబడెనో ఎవరుచెప్పగలరు?